మట్టి వినాయకులనే పూజిద్దాం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

రంగధాముని (ఏడీఎల్) చెరువులో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, జడ్సీ అపూర్వ చౌహాన్

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 30 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని రంగధాముని, అంబీర్ చెరువులను, నిమజ్జన కొలనులను జడ్సీ అపూర్వచౌహాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన రంగులతో తీర్చిదిద్దిన విగ్రహాలను పూజించి చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల చెరువులోని జీవరాశులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. మరోవైపు చెరువులోని నీళ్లన్నీ కలుషితం కావడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు హానీ కలుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని మట్టి విగ్రహాలను పూజించి చెరువులలో నిమజ్జనం చేయాలని కోరారు. జీహెచ్ఎంసీలో ఐదువేల మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీలోని నెక్సెస్ మాల్ చౌరస్తాలో ఫ్లైఓవర్ కింద నిర్మించిన స్పోర్ట్స్ ఏరినాను పరిశీలించి... ఇలాంటి స్టేడియాలను నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబురావు, ఎస్ఈ చిన్నారెడ్డి, డీసీలు రమేశ్, కృష్ణయ్య, ఈఈ శ్రీనివాస్, ఏఎంహెచ్‌వో కార్తీక్, కూకట్‌పల్లి సీఐ ముత్తు, ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్, జలమండలి డీజీఎం శిరీష, మేనేజర్ సలోని, ఏఈ శ్రీనివాస్, రాంకీ ప్రతినిధి హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులు కల్పించాలి..

దుండిగల్/కుత్బుల్లాపూర్: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూకట్‌పల్లి జోనల్,కుత్బుల్లాపూర్,గాజులరామారం జంటసర్కిల్ల పరిధిలో శుక్రవారం పర్యటించారు. జంట సర్కిల్ల పరిధిలోని పలు చెరువులు,బేబీ పాండ్ల వద్ద చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వెన్నెలగడ్డ చెరువు, గాజులరామారం సర్కిల్ పరిధిలోని సూరారం కట్టమైసమ్మ(లింగం)చెరువు,గాజులరామారంలోని పరికి చెరువులోని బేబీ పాండ్స్ వద్ద చేపట్టిన నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని, వారంలోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్, కుత్బుల్లాపూర్,గాజులరామారం జంట సర్కిల్లకు చెందిన డీసీలు నర్సింహ,మల్లారెడ్డి,సూరారం,గాజులరామారం డివిజన్‌ల కార్పొరేటర్‌లు మంత్రిసత్యనారాయణ,రావులశేషగిరి రావు,మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించరా..!

బాలానగర్: తమాషా చేస్తున్నారా.. మేయర్ వస్తే అధికారులు ప్రొటోకాల్ పాటించరా.. నిన్న శేరిలింగంపల్లికి వెళితే పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో సహా అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. ఇక్కడేంటి నలుగురు ఐదుగురే హాజరయ్యారు అంటూ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులపై మండి పడ్డారు. శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువు కొలనులో నిర్వహించే గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు సమీపంలోని వినాయక నిమజ్జన కొలనును స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి పరిశీలించారు. విద్యుత్‌శాఖ, జలమండలి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎవరు రాలేదు ఎందుకు రాలేదు, కేవలం విద్యుత్ శాఖ లైన్‌మెన్ మాత్రమే వచ్చాడు. అసలు వారు ఏమనుకుంటున్నారు అని ప్రశ్నించారు. ఈ రోజు రాని వారికి మెమోలు అందించండి అని కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ చౌహాన్‌కు మేయర్ సూచించారు. తాను 7, 8 తేదీల్లో మళ్లీ వస్తాను అప్పటి వరకు ఏర్పాట్లు అన్ని పూర్తి చేసి ఉండాలి తేడా వస్తే సహించేది లేదని హెచ్చరించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి వేస్తే ఆయా వ్యర్థాలను 15 రోజులైనా తొలగించలేదని కార్పొరేటర్ నర్సింహయాదవ్ మేయర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఎంటమాలజీ అధికారులు ఎక్కడా.. గుర్రపు డెక్క వ్యర్థాలను ఎందుకు తొలగించలేదు. సాకులు చెప్పొద్దు పని చేయండన్నారు. సక్రమంగా ఫాగింగ్ చేస్తున్నారా.. అసలే వర్షాకాలం విష జ్వరాలు వస్తున్నాయి, నాలుగు రోజులకొకసారి ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలని, చాలా అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ చౌహాన్, డీసీ కృష్ణయ్య, ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్‌రావు పాల్గొన్నారు.

బేబీ పాండ్ పరిశీలన..

మియాపూర్ : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు ఆవరణలో ఉన్న నిమజ్జన బేబీ పాండ్‌ను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ సహా ఇతర అధికారులతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎటువంటి అసౌకర్యాలకు తావు లేకుండా గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనానికి బేబీ పాండ్లను సిద్ధం చేయాలన్నారు. డీసీ కృష్ణయ్య, ఆయా విభాగాల అధికారులు ఉన్నారు.



సూరారం లింగం (కట్టమైసమ్మ) చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బోయిన్ చెరువు కట్ట వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్, కార్పొరేటర్ నర్సింహయాదవ్

పేదోళ్ల పొట్టకొడితే ఏం వస్తది..?

బోయిన్ చెరువు కట్ట వద్దకు నగర మేయర్ వచ్చారని తెలుసుకున్న హరిజన బస్తీ వాసులు మేయర్ విజయలక్ష్మిని కలిశారు. రెవెన్యూ అధికారులు 7 రోజులలోగా తమ ఇళ్లు కూలగొడతామని తమకు నోటీసులు జారీ చేశారని మేయర్‌కు తమ గోడును తెలిపారు. తాము ఇక్కడ 45 సంవత్సరాల నుంచి ఇండ్లు కట్టుకొని కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. తమలాంటి పేదోళ్ల పొట్టకొడితే సీఎం రేవంత్‌రెడ్డికి ఏం వస్తది, అధికారులకు ఏం వస్తదని ఆవేదన వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన మేయర్ విజయలక్ష్మి ఆందోళన చెందవద్దు అని బాధితులకు భరోసా ఇచ్చారు. రెవెన్యూ అధికారులు అందజేసిన నోటీసుల అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి పేదలకు తగిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలని రిలే దీక్ష

సమగ్ర కుల గణన చేపట్టాలని కోరుతూ బీసీ సంఘం నేత పర్వత సతీశ్‌కుమార్ పటేల ఆధ్వర్యంలో జగిద్గిరి గుట్ట బస్టాప్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సతీశ్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర కుల గణన చేపట్టాలని, తద్వారా వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. తక్షణమే ఈ ప్రక్రియను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా రిలే దీక్షకు తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాచర్ల భద్రయ్య, సుధాకర్, నర్సయ్య, కృష్ణ , దత్తాత్రి తదితరులు తమ మద్దతు తెలిపారు.

–మియాపూర్ , ఆగస్టు 30

నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్ , ఆగస్టు 30 : ఆర్టీసీ మియాపూర్ డిపో 2 ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11–12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం వెంకటేశం శుక్రవారం తెలిపారు. డిపో పరిధిలోని మియాపూర్ , బాచుపల్లి, మల్లంపేట్, నిజాంపేట సహా పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీసు సేవలకు సంబంధించి సమస్యలు సలహాలు సూచనలను ఈ కార్యక్రమం ద్వారా తెలుపాలని డీఎం కోరారు. ప్రజలు 9959226420 నంబరులో సంప్రదించాలని , మెరుగైన బస్సు సర్వీసు సేవలను అందించేందుకు దోహదపడాలని, డయల్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం వెంకటేశం కోరారు.

నేడు లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

దుండిగల్,ఆగస్టు 30: గాజులరామారం (సర్కిల్) డివిజన్,హెచ్ఏఎల్ కాలనీ సమీపంలోని శ్రీనల్లగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాధికార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, అముర ఇంద్రసేనాగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహస్వామివారికి ఉదయం 7గంటలకు పంచామృతాభిషేకం,10గంటలకు లక్ష్మీసుదర్శన నారసింహ మహ యాగం,హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా సాయంత్రం 5 గంటలకు దేవతా(ఉత్సవ)మూర్తుల ఊరేగింపు ఆలయ ప్రదక్షిణ పూర్వకంగా జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపను పొందాలని ఆయన కోరారు.

త్వరలో ఫతేనగర్ ఎస్టీపీ ప్రారంభం

ఎస్టీపీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, ఆగస్టు 30 : మురుగునీటిని శుద్ధి చేయడం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టి పూర్తి చేసిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. ఫతేనగర్ డివిజన్ లాల్‌బహదూర్‌శాస్త్రినగర్‌లో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని కార్పొరేటర్ సతీశ్‌గౌడ్‌తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవైనా పనులు పెండింగ్ ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలాల ద్వారా ప్రవహిస్తున్న మురుగునీటిని శుద్ధి చేయడం, గ్రౌండ్ వాటర్ పొల్యూషన్ కాకుండా నిరోధించడం కోసం రూ. 135 కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీపీల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అతి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుల ప్రారంభించడానికి ఎస్టీపీ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎస్టీపీల నిర్మాణం ద్వారా మురుగునీరు ఇబ్బందులు దూరమవుతాయన్నారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, రాములు, శంకర్‌గౌడ్, ఉదయ్ పాల్గొన్నారు.

భారతీయ ఫ్యాషన్ అంతర్జాతీయంగా విస్తరించింది

కొండాపూర్, ఆగస్టు 30 : ఫ్యాషన్ కోసం ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందని, గొప్ప వైవిధ్యమైన చేతితో తయారు చేసే వస్త్రాలు మరెక్కడ దొరకకపోవడమే ఇందుకు కారణమని ప్రముఖ టెక్స్‌టైల్ అండ్ ఫ్యాషన్ డిజైనర్ గౌరంగ్ షా అన్నారు. శుక్రవారం నాలెడ్జ్ సిటీలోని కోరమ్ క్లబ్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన సస్టైనబుల్ ఫ్యాషన్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎఫ్ఎల్ఓ ప్రతినిధి పింకీరెడ్డి, శివం పుంజ్యా, సాచి బహ్ల్, రిధి జైన్‌లతో కలిసి చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ ఫ్యాషన్ అంతర్జాతీయంగా విస్తరించిందని, వైవిధ్యమైన చేతితో తయారు చేసే వస్త్రాలు కేవలం భారతదేశంలో మాత్రమే లభిస్తాయన్నారు. మన నేత కార్మికులు బహుముఖ ప్రజ్ఞావంతులని, చీర కట్టుకోవడం కష్టమని ఎందుకు అనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

జగద్గిరిగుట్ట, ఆగస్టు30: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే శిబిరాలు ఉపయోగించుకోవాలని వైద్యులు సూచించారు. జగద్గిరిగుట్ట పొలాలబస్తీలో శుక్రవారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఒకరికి డెంగ్యూ నిర్ధారణ అయిందని తెలిపారు. వర్షాకాల నేపథ్యంలో పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ శంకర్,తెరాస నేత జైహింద్, సిబ్బంది లలిత,కళ్యాణి, మౌనిక ,శ్రీలత, గాయత్రి, రత్నమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బాలానగర్, ఆగస్టు 30 : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు ఓల్డ్‌బోయిన్‌పల్లి ఫీడర్ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్, మలికార్జునకాలనీ, ఫ్రెండ్స్‌కాలనీ, యాదవబస్తీ, సాయి కృష్ణకాలనీ, రమ్య హాస్పిటల్, బోయిన్‌పల్లి చౌరస్తా, ఛత్రిగడ్డ, గంగపుత్ర సంఘం, మెయినటరీ స్కూలు, భాగ్యశ్రీగార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు హస్మత్‌పేట ఫీడర్ పరిధిలోని హస్మత్‌పేట ముస్లింబస్తీ, లయన్స్‌టౌన్‌కాలనీ, అబ్రార్‌నగర్, ట్రినిటీ టవర్స్, ఎస్ఎస్ రెసిడెన్స్, సూర్య ఎన్‌క్లేవ్, రాంగోపాల్ ఎన్‌క్లేవ్, మారుతీనగర్, సాయిబాబా టెంపుల్, సిండికేట్ బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు కళింగ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని హెచ్ఏఎల్ పార్క్, ఆర్ఆర్‌నగర్, వల్లబ్‌నగర్, ఈద్గా, నాగిరెడ్డికాలనీ, బాలాజీ ఎన్‌క్లేవ్, కళింగ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ అందరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన సూచించారు.

కేపీహెచ్‌బీ కాలనీ సెక్షన్ పరిధిలో..

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ ఎల్ఐజీ ఫ్లాట్స్, ఎంఐజీ ఫ్లాట్స్, బీఎస్ఎన్ఎల్ ఎక్సెంజ్, పార్క్ వ్యూ ఎన్‌క్లేవ్, శ్రీనిధి అర్కెడ్ పరిసర ప్రాంతాలలో... మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్, భువనవిజయం గ్రౌండ్, ఎంఐజీ 589 నుంచి 841 వరకు.... మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు మంజీరామాల్, జేఎన్‌టీయూహెచ్ కళాశాల గేట్, రెమెడి వైద్యశాల, ట్రావెల్స్ రోడ్డు పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

కూకట్‌పల్లిలో... కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ చైతన్య తెలిపారు. నేడు ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు బాలకృష్ణనగర్, శ్రీకృష్ణనగర్, లక్ష్మీనగర్ విల్లాస్, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు కూకట్‌పల్లి రామాలయం ఏరియా, విశాల్ టవర్స్, బాగ్‌అమీర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు

11 కేవీ లక్ష్మీ నగర్ ఫీడర్ పరిధిలో..

మియాపూర్ : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా 11 కేవీ లక్ష్మీ నగర్ ఫీడర్ పరిధిలో లక్ష్మీ నగర్, దోవ కాలనీలలో శనివారం ఉదయం 10గంటల నుంచి 11.30 వరకు, 11 కేవీ ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలో ప్రజాపతి అపార్టుమెంట్, మయూరినగర్ పార్కు, ప్రశాంత్‌నగర్‌లలో ఉదయం 11గంటల నుంచి11.30 వరకు , 11 కేవీ కేంద్రీయ విహార్ ఫీడర్ పరిధిలో కేంద్రీయ విహార్, మయూరినగర్ పార్క్‌లలో ఉదయం 11.30గంటల నుంచి 12 వరకు , 11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో బృందావన్ కాలనీ, హైదర్‌నగర్ ప్రాంతాలలో 12గంటల నుంచి 12.30 వరకు, 11 కేవీ గోకరాజు ఫీడర్ పరిధిలో మయూరినగర్, గోకరాజు కళాశాల రోడ్‌లలో 12గంటల నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు హైదర్‌నగర్ ఏఈ హరిసింగ్ శుక్రవారం తెలిపారు.

కుత్బుల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్ : మరమ్మతుల కారణంగా ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో నేడు కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు 11కేవీ పద్మానగర్ ఫీడర్ పరిధిలో పద్మానగర్ ఫేస్–2, పద్మానగర్ రింగ్‌రోడ్డు, బాపునగర్, శ్రీరామ్‌నగర్, జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు బీరప్పనగర్, దేవమ్మ బస్తీలో, జీడిమెట్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి అర్ధగంట పాటు జీడిమెట్ల ఫేస్–5 ఇండస్ట్రీయల్ ఏరియా, 11.30 నుంచి 12 గంటల వరకు అయిమాత టెంపుల్ రోడ్, భాగ్యలక్ష్మి కాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియాలో కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయా సబ్‌స్టేషన్ల ఏఈలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించండి

వైద్యసేవలను అడిగి తెలుసుకుంటున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

కొండాపూర్, ఆగస్టు 30 : రోగులను నిలబెట్టే వైద్యులు వైద్య చికిత్సనందించడంపై రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైరల్ ఫీవర్స్, డెంగ్యూ కేసులు పెరుగుతున్న క్రమంలో ఆయన శుక్రవారం కొండాపూర్‌లోని రంగారెడ్డి జిల్లా దవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు. దవాఖానలోని జనరల్ వార్డు, ప్రసూతి వార్డు, గైనకాలజిస్ట్ ఓపీ వార్డు, చిన్న పిల్లల వార్డులను పరిశీలించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను రోగులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంక్, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న టీ–హబ్ వివరాలను దవాఖాన సూపరింటెండెంట్ అనురాగిణిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో గురువారం రాత్రి దవాఖానలో చేరిన రోగికి శుక్రవారం వరకు పరీక్షలు చేయకపోవడంపై అక్కడే విధులు నిర్వహిస్తున్న వైద్యులను మందలించారు. డెంగ్యూ వైద్య పరీక్షల కోసం రోగులను బయటకు పంపవద్దని అన్ని రకాల పరీక్షలు దవాఖానలోనే చేసే అవకాశం ఉన్నప్పటికీ బయటకు పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా, వైద్యం కోసం వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 24 గంటల పాటు సేవలందించాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కొండాపూర్ జిల్లా దవాఖానలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, డాక్టర్లు సైతం 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దవాఖానకు కొత్తగా ఏవైనా ఎక్విప్‌మెంట్ కావాల్సి వచ్చిన, అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజు యాదవ్, డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు, దవాఖాన ఆర్ఎం పాల్గొన్నారు.

జేఎస్ఎస్‌కే, డైట్ బిల్లులు చెల్లించండి : కొండాపూర్ జిల్లా దవాఖానలో ఇన్‌పెషెంట్లకు ఆహారాన్ని అందించే తిరుమల కాంట్రాక్టర్స్‌కు భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్ని సార్లు బిల్లులు పెట్టినప్పటికీ పాసవ్వడం లేదంటూ శుక్రవారం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు మొర పెట్టుకున్నాడు. డిసెంబర్ 2022 నుంచి జేఎస్ఎస్‌కే బిల్లు రూ. 70లక్షలు, మెటర్నిటీకి సంబంధించి రూ.30 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్‌ను కోరారు.

కనిపించని పరిశుభ్రత..

డెంగ్యూ, వైరల్ ఫీవర్లు ప్రబలుతున్న నేపథ్యంలో కొండాపూర్‌లోని జిల్లా దవాఖానలో అందుతున్న వైద్య సేవలు, నిర్వహణపై హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దవాఖాన ఆవరణ అపరిశుభ్రంగా నెలకొని ఉంది, మురుగునీరు పారుతుండడం, టాయిలెట్ల నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

దోమల నివారణకు చర్యలు

మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్ , ఆగస్టు 30 : వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానంగా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని పరిసరాల పరిశుభ్రత పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జోన్ వ్యాప్తంగా దోమల నివారణ చర్యలపై జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ, ఆర్‌సీపూర్ పటాన్ చెరు, శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో కాలనీలలో ప్రతి సాయంత్రం సమయాల్లో విస్తృతంగా ఫాగింగ్ ప్రక్రియను చేయిస్తున్నట్లు, రహదారులు ఆవాస నివాసాల నడుమ వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవటంతో పాటు ప్రజలలోనూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. టైర్లు, కొబ్బరి కుడకలు , డ్రమ్ములు, కొబ్బరి బొండాలు సహా ఇనుప డబ్బాలలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని తమ ఎంటమాలజీ సిబ్బందితో క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరుస్తున్నామన్నారు. చెరువులు కుంటలలో గుర్రపు డెక్క తొలగింపుతో పాటు పునరావృతం కాకుండా ప్రత్యేక స్ప్రే చేయిస్తున్నట్లు జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. దోమల వ్యాప్తి అరికట్టడటంలో భాగంగా లార్వా దశలోనే నియంత్రణ చర్యలు చేపడుతున్నామని , చెరువు పరిసరాలలోని సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతో చెరువులలో ఆయిల్ బాల్స్‌ను వేయిస్తున్నామన్నారు. ఏరియా సహా బస్తీ దవాఖానల నుంచి రోజువారీగా అందే నివేదికల ఆధారంగా డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలలో ప్రభావిత నివాసం నుంచి సుమారు 150 ఇండ్ల వరకు దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి తెలిపారు. ప్రజలు సైతం పరిసరాల పరిశుభ్రతను ప్రాధాన్యతగా పరిగణించాలని, ఈ అంశంపై జోన్ పరిధిలోని ప్రభుత్వ , ప్రభుత్వేతర పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు, విద్యార్థుల ద్వారా తిరిగి వారి నివాసాల వద్ద ప్రజలను చైతన్య పరుస్తున్నామని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

నవంబర్ 17న 'వాక్‌ఫర్ హోప్'

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మర్రిలక్ష్మణ్‌రెడ్డి,అన్వాస సంస్థ ప్రతినిధులు

దుండిగల్,ఆగస్టు 30: అన్వాస సంస్థ రెండో ఎడిషన్‌ను పురస్కరించుకుని నవంబర్ 17న జలవిహార్‌లో 'వాక్‌ఫర్ హోప్' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఆర్ విద్యాసంస్థల అధినేత, వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అన్వాస ప్రతినిధి శ్రీరామ్ మాట్లాడుతూ ఈ వాక్‌ఫర్ హోప్ అనే కార్యక్రమం ద్వారా నిధులు సమీకరించి తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రత్యేక హోం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ హోంలో వృద్ధులకు, అనాథలకు వసతి కల్పించి వాళ్ల బాగోగులు చూడడంతో పాటు అనాథ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించి వారిని గొప్పగా తీర్చిదిద్దే ఒక మంచి కార్యక్రమమని తెలిపారు. అనంతరం మర్రి లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు,అనాథ విద్యార్థులను ఒకే చోట చేర్చడం ద్వారా ఇరువురికి ఒక మంచి బాంధవ్యం ఏర్పడి అనాథ పిల్లలకు ఎవరూ లేరు అనే విషయం మర్చిపోతారని తెలియజేశారు. వృద్ధులకు సైతం అనాథ పిల్లలను మంచిగా తీర్చిదిద్దడానికి, వారికి చేదోడు వాదోడుగా ఉండడానికి ఈ హోం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంత మంచి హోంను నిర్మించడానికి ముందుకు వచ్చిన అన్వాస ప్రతినిధులను మర్రి లక్ష్మణ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రమణి,సాకేట్ ప్రణామ్ హోమ్స్ ప్రతినిధులు,ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్,అన్వాస ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సంతోష్ కుమార్

నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర ఎస్సీమోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

దుండిగల్,ఆగస్టు30: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి,బాచుపల్లిలోని శ్రీసాయినగర్‌కు చెందిన గజ్జెల్లి సంతోష్ కుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సంతోష్ కుమార్‌కు నియామకపు పత్రాన్ని అందజేశారు.బీజేపీ సిద్ధాంతం,ఆదర్శాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ముఖ్యంగా రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచి అన్ని వర్గాలలో మరింత విస్తరించడానికి కృషి చేయాలని కొండేటి శ్రీధర్,సంతోష్‌కుమార్‌కు వివరించారు. కాగా తనకు పదవీబాధ్యతలు అప్పగించిన కొండేటి శ్రీధర్‌కు సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు.

కనకదుర్గ అమ్మవారికి పూజలు

ఫతేనగర్ జవహర్‌కాలనీలోని కనకదుర్గదేవి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి దోర్బల కాశీనాథ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పసుపు కుంకుమ తదితర పూజలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

–బాలానగర్, ఆగస్టు 30 :

గ్యాస్‌పైప్‌లైన్ లీకై మంటలు

భాగ్యనగర్ : గ్యాస్‌పైప్‌లైన్ లీకై మంటలు చెలరేగిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రాంరెడ్డినగర్ శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల ప్రకారం..జీడిమెట్ల పారిశ్రామికవాడలోని రాంరెడ్డి నగర్‌లో తెల్లవారుజామున భాగ్యనగర్ ఏజెన్సీకి చెందిన పైపులైన్ లీకేజీగా మారి మంటలు చెలరేగాయి. స్థానికంగా ఉన్న ఆయా కంపెనీలలో పని చేసే కార్మికులు గమనించి వాటర్‌ట్యాంకర్లతోమంటలను ఆర్పేప్రయత్నం చేయడంతో పాటు జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందివ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. భాగ్యనగర్ ఏజెన్సీకి సమాచారం ఇవ్వడంతో పెనుప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.